# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 03-09-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఉత్తరాంధ్రను అభివృద్ధికి చిరునామాగా తీర్చిదిద్దుతామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

2. **ప్రాణహిత-చేవెళ్ల, కల్వకుర్తి ఎత్తిపోతల ప్రాజెక్టులను పూర్తి చేసి తెలంగాణ ప్రజలకు అంకితం చేస్తామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తెలిపారు.**

3. **ఆంధ్రప్రదేశ్‌లోని రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేస్తామని మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు.**

4. **బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని వసతి గృహాల్లో బాలికల కోసం 6 కోట్ల రూపాయలతో శానిటరీ కిట్లను అందిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ మంత్రి ఎస్.సవిత తెలిపారు.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి జిల్లా పాయకరావుపేట వద్ద పోలవరం ఎడమ కాలువ నుంచి గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విడుదల చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, నీరు పుష్కలంగా ఉంటే పరిశ్రమలు, ఉద్యోగాలు, ఉపాధికి భద్రత ఉంటుందని తెలిపారు. విశాఖ, అనకాపల్లి ప్రాంతాలకు భారీ పెట్టుబడులు రానున్నాయని, డేటా సెంటర్లు, ఐటీ కంపెనీలు ఏర్పాటు కానున్నాయని చెప్పారు. విశాఖను ఏఐ పట్నంగా, ఉత్తరాంధ్రను అభివృద్ధికి చిరునామాగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి పేర్కొంటూ,

వాయిస్ ..30.. సెకన్లు

---------------------------

ప్రాణహిత-చేవెళ్ల, ఎస్ఎల్‌బీసీ, కల్వకుర్తి ఎత్తిపోతల ప్రాజెక్టులను పూర్తి చేసి తెలంగాణ ప్రజలకు అంకితం చేస్తామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తెలిపారు. ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో నిర్వహించిన డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అవార్డు-2026ను డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌కు ప్రదానం చేసే కార్యక్రమంలో రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రాజశేఖరరెడ్డి ప్రారంభించిన సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి ఆయన ఆశయాలను కొనసాగిస్తామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పేర్కొంటూ,

వాయిస్ ..30.. సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగ సంఘాల నాయకులతో త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో రెవెన్యూ ఉద్యోగ సంఘాల నాయకులు మంత్రిని కలిసి నిన్న వినతిపత్రం అందజేశారు. సర్వేయర్లు ఇతర రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అలాగే బకాయిలు, మధ్యంతర భృతి, పీఆర్సీ అంశాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి స్పందిస్తూ, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ఆర్థికపరమైన అంశాలపై చర్చిస్తానని హామీ ఇచ్చారు.

---------------------------

పల్నాడు జిల్లా కాకానిలోని జేఎన్‌టీయూకే ఇంజినీరింగ్ కళాశాలలో నూతనంగా నిర్మించిన మూడు వసతి భవనాలను ఆంధ్రప్రదేశ్ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ నిన్న ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 70 కోట్ల వ్యయంతో 1,600 మంది విద్యార్థులకు అత్యాధునిక వసతులతో గౌతమి, కృష్ణవేణి, నాగార్జున పేర్లతో ఈ వసతిగృహాలను నిర్మించారని చెప్పారు. తర్వాత కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో క్రీడా వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో 20 కోట్ల రూపాయలతో నిర్మించనున్న క్రీడా వసతి కేంద్రాన్ని అధికారులతో కలిసి మంత్రి నిన్న పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, యువత, క్రీడాకారులకు పూర్తి స్థాయిలో ఉపయోగపడేలా ఆధునిక క్రీడా మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి, వారికి మెరుగైన శిక్షణ, వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు.

---------------------------

దివ్యాంగులు, వయోవృద్ధులకు ప్రభుత్వ కార్యాలయాల్లో సులభతరమైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. ప్రకాశం జిల్లా ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో 43 లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన ప్రత్యేక లిఫ్ట్‌ను జిల్లా కలెక్టర్ రాజాబాబుతో కలిసి మంత్రి నిన్న ప్రారంభించారు. జిల్లాలో గుర్తించిన 13 వేల మంది దివ్యాంగులకు విడతల వారీగా సహాయ పరికరాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి ఈ సందర్భంగా తెలియజేస్తూ…

వాయిస్…30 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని వసతి గృహాల్లో బాలికల కోసం 6 కోట్ల రూపాయలతో శానిటరీ కిట్లను అందిస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. విజయవాడ గుణదలలోని బీసీ బాలికల వసతి గృహంలో కిట్లను మంత్రి నిన్న పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఒక్కో

కిట్‌లో 11 రకాల పారిశుధ్య వస్తువులు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణంతో పాటు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. రానున్న పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో మెరుగైన ఫలితాల కోసం ఇప్పటి నుంచే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

---------------------------

తెలంగాణలోని ములుగు జిల్లా పాలంపేటలో 'గొల్లల గుడి'కి జాతీయ ప్రాధాన్య కట్టడంగా గుర్తింపు లభించింది. ఈ మేరకు కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ పరిధిలోని భారత పురావస్తు సర్వేక్షణ సంస్థ-ఏఎస్ఐ అధికారిక ప్రకటన జారీ చేసింది. ఆగస్టు 31న జారీ చేసిన ప్రకటనను 'గెజిట్ ఆఫ్ ఇండియా'లో ప్రచురించారు. ప్రాచీన కట్టడాలు, పురావస్తు ప్రదేశాలు, అవశేషాల చట్టం-1958ప్రకారం ఈ గుర్తింపు ఇచ్చినట్లు ఏఎస్ఐ తెలిపింది. పాలంపేటలోని యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశం రామప్ప ఆలయానికి నైరుతి దిశలో ఉన్న 'గొల్లల గుడి' విశిష్ట నిర్మాణంతో తూర్పు ముఖంగా ఉన్న మండపం, చుట్టూ మూడు గర్భాలయాలతో త్రికూటాలయంగా ప్రసిద్ధి చెందింది.

---------------------------

అగ్నివీర్ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో చేపట్టిన ఆర్మీ నియామక ర్యాలీ గత అర్ధరాత్రి నుంచి ప్రారంభమైంది. ఈ నెల 20వ తేదీ వరకు ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ర్యాలీ కొనసాగనుంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి సుమారు 10 వేల 350 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ఆర్‌కే బీచ్ రోడ్డులో 1.6 కిలోమీటర్ల రన్నింగ్ ట్రాక్‌ను సిద్ధం చేశామని అధికారులు తెలిపారు. అభ్యర్థులు తమకు కేటాయించిన తేదీ, సమయానికి అవసరమైన ధృవపత్రాలతో హాజరుకావాలని అధికారులు సూచించారు.

ఇదిలా ఉండగా, ర్యాలీ నేపథ్యంలో ప్రతిరోజూ రాత్రి 11 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు పార్క్ హోటల్ జంక్షన్ నుంచి ఎన్‌టీఆర్ సర్కిల్ వరకు వాహనాల రాకపోకలపై ఆంక్షలు అమల్లో ఉంటాయని వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలని పోలీసు అధికారులు సూచించారు.

---------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం, అల్పపీడన ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లోని దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాలోని పలు ప్రాంతాల్లో రానున్న రెండు రోజుల పాటు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది.

మరోవైపు.. తెలంగాణ రాష్ట్రంలోనూ రానున్న రెండు రోజుల పాటు పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

=====================